క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన వసతిగృహ సంక్షేమ అధికారులు



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి మొక్క అందజేస్తున్న అధికారులు

మిర్యాలగూడ అర్బన్ : నియోజకవర్గ పరిధిలో బీసీ, ఎస్టీ, ఎస్సీ వసతిగృహాల్లో నూతనంగా నియామకమైన సంక్షేమ అధికారులు మంగళవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వసతిగృహాల్లోని సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏబీసీడబ్ల్యూఓ కొణతం చంద్రారెడ్డి, వసతిగృహ సంక్షేమ అధికారులు టి.వెంకటేశ్వర్లు, నుస్రత్ అలీ, లక్ష్మయ్య, జానిమియా, పార్వతి, సీతా సావిత్రి, కవిత, సోమరాజు, తోట నరేష్, మంగమ్మ, సంధ్యారాణి, సతీష్, బి.రామకృష్ణ, తరుణ్, రాకేష్, హరీష్, మంజుల, స్వాతి ఉన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు నగదు బహుమతి



చిత్రలేఖనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో డ్రాయింగ్ మాస్టర్ విజయ్

మిర్యాలగూడ అర్బన్ : ఇటీవల ది వరల్డ్ జూబ్లీహిల్స్, డీఎస్ఆర్ గ్రూప్స్ సంయుక్తంగా నిర్వహించిన ‘గ్రో ట్రీస్ నేచర్ టు లైఫ్’ అంశాల్లో బాలబాలికలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన బి.ఉజ్వల టి.అక్షయ్ వేసిన చిత్రాలకు గాను రూ.10వేల వోచర్లతో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అంతే కాకుండా తులసీరాం, జశ్వంత్, మాన్వితారెడ్డి, మోక్షిత్‌కుమార్, ఆర్య, ఆద్యలు జూబ్లీహిల్స్‌లోని డీఎస్ఆర్ భవన్‌లో నిర్వాహకుల చేత ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు డాయింగ్ మాస్టర్ విజయ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చందంపేట : మండలంలోని గన్నేర్లపల్లి చెంచు కాలనీ వాసులకు కేటాయించిన ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపిస్తూ మంగళవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం 20ఏళ్ల క్రితం సర్వే నం.300లో ఇక్కడి చెంచులకు 2ఎకరాల చొప్పున భూమిని కేటాయించింది. అయితే ఇట్టి భూమిని గన్నేర్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2018–19లో తన పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వినతిలో పేర్కొన్నారు. కాస్తుకబ్జాలో ఉన్న రైతుల పేరిట భూమిని నమోదు చేయకుండా సదరు వ్యక్తి తన పేరిట అక్రమంగా నమోదు చేయించుకున్నారని, దీంతో అసలైన లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శివర్ల సత్యనారాయణ, చిర్ర గురువయ్య, చిర్ర రాజు, లింగస్వామి, సత్యనారి తదితరులున్నారు.

తలనీలాల సేకరణకు నేడు వేలం పాట

నిడమనూరు : మండలంలోని కోట మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో తలనీలాల సేకరణకు నేడు (బుధవారం) వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.నవీన్ మంగళవారం తెలిపారు. ఏడాది కాలానికి భక్తుల తలనీలాల సేకరణ కోసం నిర్వహించే వేలంలో ఆసక్తి గల వారు బుధవారం ఉదయం 10గంటల వరకు రూ.2లక్షల డిపాజిట్ డీడీతో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. యూనియన్ బ్యాంకులో రూ.2లక్షల డీడీ శ్రీకోటమైసమ్మ దేవస్థానం, ఇండ్లకోటయ్యగూడెం బ్రాంచ్‌లో తీసుకొని వేలంలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయంలో వినతి

దేవరకొండ : మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సీఈసీ గ్రూప్‌ను నార్కట్‌పల్లికి మార్చడం సబబు కాదని తిరిగి సీఈసీ గ్రూప్‌ను దేవరకొండకు మార్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఈసీ గ్రూపును దేవరకొండ నుంచి నార్కట్‌పల్లికి మార్చడంతో ఇక్కడి నిరుపేద విద్యార్థులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అప్పం వీరయ్య, పున్న వెంకటేష్, తూటుపల్లి శ్రీను, బాలస్వామి, మాకం చంద్రమౌళి, గడ్డం భిక్షమయ్య, గండూరి లక్ష్మణ్, తదితరులున్నారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచన
- దళారులను నమ్మి మోసపోవద్దంటున్న అధికారులు



చింతపల్లి మండలంలో విత్తన దుకాణాలు తనిఖీ చేస్తున్న ఏడీఏ (ఫైల్)

దేవరకొండ: రైతులు విత్తనాల విక్రయాల విషయంలో ఎలాంటి మోసాలకు గురికాకుండా నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసే రైతులు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా అధికారులు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఆయా పంటల సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నియోజకవర్గ పరిధిలో గల మండలాల్లో టాస్క్‌ఫోర్స్ టీంల వారీగా ఎప్పటికప్పుడు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

దేవరకొండ డివిజన్‌లో 2లక్షల40వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు..

దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు వ్యవసాయం సాగు చేస్తుంటారు. దేవరకొండ డివిజన్ పరిధిలో 2లక్షల40వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా వాటిలో 1లక్షా70వేలు పత్తి, 55వేల ఎకరాల్లో వరితో పాటు మరో 15వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నాయి. విత్తన దుకాణాల యజమానులు ప్రభుత్వం అనుమతిచ్చిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే గతంలో కొందరు దళారులు ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు తీసుకొచ్చి రైతులకు అంటగట్టిన దాఖలాలు సైతం లేకపోలేదు. దీంతో రైతులు పంట దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించే విధంగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులపై కొరడా ఝుళిపించేందుకు సైతం తనిఖీలు ముమ్మరం చేశారు. విత్తన వ్యాపారులు రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి రశీదు ఇవ్వాలని, స్టాక్ వివరాలను డిస్‌ప్లే చేయాలని దుకాణదారులకు సూచిస్తున్నారు. రైతులు గ్రామాల్లో దళారులను నమ్మి మోసపోకూడదని, నకిలీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఇప్పటికే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు విస్తృతం చేశాం. విత్తన విక్రయ దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలి. అందుకు సంబంధించి తప్పనిసరిగా కొనుగోలుదారులకు రశీదు ఇవ్వాలి. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం అధికారులకు అందించాలి.

– శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

త్రిపురారం : ప్రభుత్వ నిర్ణయం మేరకు భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ రెవెన్యూ అధికారులుకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు అవసరమయ్యే సర్టిఫికెట్లను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

మూసివేసిన పాఠశాలలను తెరిపించాలని వినతి

చింతపల్లి : విద్యార్థులు లేరంటూ మండలంలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు సోనగంటి వేణుగోపాల్ మంగళవారం ఎంఈఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఆవాసంలో బడి ఈడు పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాల ఎర్రమట్టి తండా, పాలెంతండా, రాయినిగూడెం, బద్దంవారిగూడెం, అనాజిపురం పీఎస్ నసర్లపల్లి తండా, ఉర్దూ మీడియం యూపీఎస్, దేవులతండా, బడులు తెరిచేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు కొర్ర జగ్రామ్, వెంకటయ్య, కృష్ణ, మల్లేశం ఉన్నారు.

రుణాలను వందశాతం రికవరీ చేయాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ : మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను వందశాతం రికవరీ చేయాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సంఘం పదాధికారుల శిక్షణ కార్యక్రమలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల తరుపున ఎంపికైన ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లోని మహిళలను చైతన్యపరుస్తూ ప్రతి నిరుపేద మహిళ సంఘంలో ఉండేలా చూడాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. శ్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను వందశాతం రికవరీ చేయాలన్నారు. దామరచర్ల మండల బ్యాంక్ రుణాలు 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.36.86కోట్లను మహిళా సంఘాలకు అందించాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన ఇంకుడుగుంతలు, కమ్యూనిటి సోక్‌పీట్స్, గుట్టలపై కందకాల వంటి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సెంట్రల్ వాటర్ కమిషన్ జేఈ ఉమాశంకర్, డీఆర్‌డీఏ క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, ఎంపీఓ, కార్యక్రమం అధికారి నాగేశ్వర్‌రావు, ఏపీఎం గుంటి దిలీప్‌కుమార్, క్లస్టర్ టీఏ నరసింహా, సీసీలు పల్లా శ్రీను, శంకర్, కవిత, ఎస్ఆర్పీలు తిరుమల, సుమతి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు



విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

డిండి : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో ఉన్న ఇంజన్ బావికి సంబంధించిన గ్రామకంఠం భూమి కబ్జాకు గురవుతుందని పలువురు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆయన విచారణ చేపట్టారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే హైవేకు ఆనుకొని పట్టణంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీపై నిర్మించిన ఇళ్లను వెంటనే తొలగించాలని ఆయన సూచించారు. ఇంజన్ బావి స్థలానికి హద్దులు గుర్తించామని, బుధవారం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఇంజన్‌బావి స్థలంలో పలువురు స్థానికులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలు తాత్కాలికంగా ఉంటాయని, తర్వాత గ్రామపంచాయతీ ఆధీనంలో ఆ స్థలంలో నూతనంగా దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి జంగయ్య, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బోధకులు

చింతపల్లి : మండలంలోని వింజమూరు గ్రామంలో మంగళవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞానగ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతిఒక్కరూ తెలుసుకోవాన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని, మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని – జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం –ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పగిడిమర్రి వెంకటేశం, చక్రధర్, రంగారెడ్డి, పరమేశ్, శ్రీనివాస్, కమలాకర్, వెంకటమ్మ, సరిత, పార్వతమ్మ ఉన్నారు.

చెరువులు, కుంటల భూముల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : చెరువు, కుంట, శిఖం భూములు ఆక్రమణకు గురైన వాటిని గుర్తింపులో భాగంగా మండల పరిధిలోని చెరువులు, కుంటలు, శిఖం, భూములను మంగళవారం తహసీల్దార్ నరేందర్, ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి సర్వే నిర్వహించారు. కొండమల్లేపల్లిలోని సర్వే నం.118లోని నల కుంట, సర్వే నం.174లోని పచ్చర్లబావి కుంట, సర్వే నం.45లోని దోనియాల పెద్దచెరువు కుంటలకు చెందిన భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. సర్వేలో ఇరిగేషన్ అధికారులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సరిత, జ్యోతి, జెల్‌సింగ్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం అందజేత

వేములపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆర్ట్ టీచర్ బొస్క సైదులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. వారిలో హెచ్ఎం బి.రమేష్, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ప్రభాకర్, ఉపేందర్, సుధాకర్, కృష్ణయ్య, వాణిశ్రీ, నాగశ్రీ, యాదమ్మ, శాంతాకుమారి, నాగమణి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమాదేవి, ఎల్లయ్య, లలిత, పద్మ తదితరులు ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

నిడమనూరు : కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే సమగ్ర సర్వే చేసి, అన్నివర్గాలకు న్యాయం చేస్తున్నామని ప్రచారం చేస్తోందని, అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు శంకర్, వెంకన్న తదితరులు ఉన్నారు.

బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలి

మిర్యాలగూడ : పట్టణంలోని సీతారాంపురం– బంగారుగడ్డ కాలనీల మధ్య నిర్మించిన నూతన బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడారు. రూ.20లక్షలతో అస్తవ్యస్తంగా నిర్మించిన బ్రిడ్జితో ఇరు కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వర్షాకాలంలో వరద నీరు బ్రిడ్జి కింద లోతట్టు ప్రాంతంలోని ఇండ్లలో వచ్చి చేరుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్రోచ్ రోడ్డును నిర్మించి వెంటనే ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, బావండ్ల పాండు, అయూబ్, రామ్మూర్తి, రమేష్, గునగంటి రామచంద్రు, భాస్కర్, షఫి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవూర : బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉదయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఉట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాటలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ వెంకాయమ్మ, పాఠశాల హెచ్ఎం భిక్షపతి, అంగన్‌వాడీ టీచర్లు శారద, రజిత, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే ప్రీస్కూల్ విద్యను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ మమత అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ మిర్యాలగూడ పరిధిలోని చిల్లాపురం సెక్టార్, శ్రీనివాస్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, మాజీ సర్పంచ్ వెంకటరమణ చౌదరి, సూపర్‌వైజర్ ఆర్.వాణి, రాధిక, హేమాదేవి, పద్మ, నజీమా బేగం, లీలాకుమారి, నాగమణి, కవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం

అడవిదేవులపల్లి : దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో మండలంలోని ఉల్సాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట –అంగన్‌వాడీ బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం– 3లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, రమాదేవి, మణెమ్మ పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : అక్షరాభ్యాసంలో పాల్గొన్న సీడీపీఓ మమత, తదితరులు

చిత్రియాలలో..

చందంపేట : మండంలోని కంబాలపల్లి సెక్టార్ పరిధిలోని చిత్రియాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ డీడబ్ల్యూ కేవీ.కృష్ణవేణి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ స్కూల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని హాలియా–5 అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట –అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉదయశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్స్ కల్పన, రాజ్యలక్ష్మి, నర్మద, విజయలక్ష్మి, వజ్రమ్మ, పుష్ప, శోభారాణి, తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని గుమ్మడవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఖతిజ పాల్గొని మాట్లాడారు. అనంతరం పిల్లలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.



పెద్దవూర : ఉట్లపల్లిలో అమ్మమాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ ఉదయశ్రీ



చందంపేట : ప్రీ ప్రైమరీ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

నాగార్జునసాగర్ : చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు బడికి పంపించాలని ఐసీడీఎస్ చలకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ గౌసియాభేగం అన్నారు. అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా మంగళవారం నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం– 3లో సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో టీచర్లు సుదర్శనమ్మ, రాజేశ్వరీ, ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి : ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడగ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి సమస్యలు తెలుసుకుని అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణలో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా భ్రష్టు పట్టిస్తూ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రణదీప్, అశోక్, సుందర్, ఆంజనేయులు, అనూష, ప్రమీల, సాయిప్రియ, శారదా, శ్వేత, మంజుల పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి

హాలియా : ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, కోరే రమేష్ అన్నారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో అనుముల మండల ఎంఈఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ప్రజల నుంచి వేలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తూ పేదరికంలోకి నెడుతున్నారని అన్నారు. కార్యకమంలో వర్షిత్, నాగరాజు, కార్తీక్, పవన్, శశి ఉన్నారు.



చింతపల్లి : నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



మిర్యాలగూడ టౌన్ : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ యువజన సంఘం నాయకులు మంగళవారం స్థానికంగా మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, గంగాధర్, ఇంద్ర, శంకర్, రమేష్, సైదులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

దేవరకొండ : ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జర్నలిస్టు పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో శివకుమార్, సాయి, మధు, వినయ్, భాను, రాజు, మహేష్, అరవింద్, ఆకాష్, తదితరులున్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం



మొక్క నాటుతున్న నాయకులు

త్రిపురారం : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనేదే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలోని కేవీకే కంపాసాగర్‌ను కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, తృణధాన్యాల పంటల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించాలని కేవీకే శాస్త్రవేత్తలను కోరారు. అనంతరం కేవీకే ఆవరణలో మొక్కలు నాటి వ్యవసాయ శాస్త్రవేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు రెమిడాల రమేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి అశోక్‌రెడ్డి, చల్లమళ సీతారాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుండా నవీన్‌రెడ్డి, సాయన్నగౌడ్, జవ్వాది సత్యనారాయణ, కొప్పు సోమయ్య, మెరుగు మహేష్, మేకల రామకృష్ణ, లింగయ్య, శంకర్, అనిల్, జానకీరాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కస్తూరిబా గాంధీ పాఠశాల భవనం ప్రారంభం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొల్‌ముంతల పహాడ్ గ్రామ సమీపంలో రూ.3.35కోట్లతో నిర్మించిన కస్తూరిబా గాంధీ పాఠశాల నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించనున్నట్లు మంగళవారం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సరళ తెలిపారు. నూతన భవనం ప్రారంభంతో విద్యార్థినిలు ఎదుర్కొన్న కష్టాలు తొలగనున్నాయని ఆమె పేర్కొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందుకుంటున్న అధ్యక్షులు

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం మండల కమిటీని నియమించారు. మండల అధ్యక్షుడిగా దున్న ముత్యాలు, గుడిపల్లి మండల అధ్యక్షుడిగా బోడ నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు వారికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర అంజనేయులు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

అంతర్జాతీయ కరాటే దినోత్సవం

కొండమల్లేపల్లి : అంతర్జాతీయ కరాటే దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి కరాటే మాస్టర్ కె.సురేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. అనంతరం సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గడ్డం శ్రీరాములు, జైహిందర్, గిరి, ఇంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలో 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అశోక్‌నగర్ ఫీడర్, శాంతి నగర్ ఫీడర్, హౌజింగ్ బోర్డు ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పట్టణంలోని డాక్టర్స్ కాలనీ, ముత్తిరెడ్డికుంట, సుందర్‌నగర్, రెడ్డి కాలనీ, వాసవీనగర్, అశోక్‌నగర్, శాంతినగర్‌లో ఉదయం 8నుంచి 11గంటల వరకు నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.